
**ఈవారం కథ**



# గురువిందలు

◆ కట్టా రాంబాబు ◆

## చల్లగా గాలి వీస్తుంటే మనసు గిలిగింతలు పెడుతోంది.

అప్పుడే సినిమా హాల్లో నుంచి బయటకొచ్చాడేమో చికాగ్గా వున్న ఒంటికి హాయిగా అనిపించింది సురేష్‌కి. వెధవ సినిమా బుర్రంతా పాడయిపోయింది. టీ తాగితే గాని లాభం లేదనుకొని పక్కనే వున్న రెస్టారెంటులోకి పోయి టీ తాగొచ్చాడు.

టైము చూసుకున్నాడు. సాయంత్రం ఆరయ్యింది.

ఆఫీసు పనిమీద ఉదయం యిక్కడకొచ్చాడు పని పూర్తయింది. మ్యాట్నీ చూసి పోవచ్చని వెళ్ళాడు. రాత్రి ఎనిమిది గంటల వరకు బస్‌లేదు. కాస్సేపలా బజార్లో తిరిగి బస్టాండ్‌కు పోవచ్చని అక్కడ నుంచి కదిలి ట్రంక్‌రోడ్డు కొచ్చాడు.

"హాయ్ ! సురేష్!"

ఉలిక్కిపడి అటూ ఇటూ చూసేసరికి ఓ షాపులోనుంచి నవ్వుతూ వస్తోందో యువతి. చాలా అధునాతంగా అలంకరించుకుందామె. అందంగా ఆకర్షణీయంగా వుంది.

"ఎవరబ్బా!" అని ఆశ్చర్యపడ్డాడు.

పొడవుగా, దానికి తగ్గ లావుతో అందమైన ఫ్రక్చరున్న ఆమెను చూస్తుంటే అతనికి మతిపోయింది.

దేవకన్యలా మెరిసిపోతోందామె.

"ఏమిటలా గుడ్లప్పగించి చూస్తున్నావు. అయితే నన్నసలు గుర్తుపట్టలేదన్నమాట. నేనయ్యా బాబూ రాధను. అప్పుడే మరిచిపోయావు. అప్పుడు నువ్వు కోసినవన్నీ కోతలన్నమాట" అంటూ గలగలా నవ్వింది.

"అరె నువ్వా! ఎన్నాళ్ళయింది నిన్ను చూసి. అప్పుడేమో సన్నగా, లంగా ఓణీల్లో వుండేదానివి. యిప్పుడేమో బాగా ఒళ్ళుచేసి బంగినపల్లి మామిడి పండులా తయారయ్యావు. అందుకే నిన్ను గుర్తుపట్టలేకపోయాను" అన్నాడు సురేష్.

"అవునూ యిప్పుడేం చేస్తున్నావు...అసలు ఎక్కడ వుంటున్నావు... పెళ్ళి చేసుకున్నావా? నేనెప్పుడైనా గుర్తుకొస్తానా..." అంటూ గబగబా అడిగేసింది.


"ఆగాగు యిదిరోద్దు. అలా నడుస్తూ మాట్లాడుకుందాం పద" అంటూ ముందుకు నడిచాడు.

ఇద్దరూ పక్కపక్కనే నడుస్తున్నారు. ఆమె అతని భుజాల వరకూ ఉంది. అంత అందమైన రాధ అతని పక్కన నడుస్తుంటే అతనికి ఎలాగో వుంది. ఆమె ఒంటికి రాసుకున్న కాస్మోటిక్స్ అతనికి మత్తునిస్తున్నాయి.

తను ఎక్కడ వుంటున్నది, ఏం చేస్తున్నది చెప్పాడు. తనకి పెళ్ళయిందని, ఓ బాబు కూడా వున్నాడని చెప్పాడు. ఆఫీసు పని మీద ఈ వూరు రావడం, సినిమాకెళ్ళడం, తిరిగి వూరికి వెళ్ళిపోవాలనుకోవడం అన్నీ చెప్పాడు.

"ఇంతకీ నీ సంగతి చెప్పనే లేదు. మీ శ్రీవారేం చేస్తున్నారు?"

"మావారిక్కడ ఓ ఫర్మ్‌లో ఎక్జిక్యూటివ్. ఆయన నాతో మాట్లాడ్డానికి కూడా తీరిక లేనంత బిజీమనిషి. ఉదయంపోతే ఏ అర్ధరాత్రికో వస్తారు. మాకోపాప కూడా వుంది. సిక్త్‌క్లాసు చదువుతోంది. హాస్టల్లో వేసాను" అంటూ నవ్వుతూ చెప్పింది.



◆◆◆

**చాలా అధునాతంగా అలంకరించుకొని ఆకర్ష ణీయంగా వుందామె**

◆◆◆



ఆమె నవ్వుతుంటే వెన్నెల నవ్వుతున్నట్లుంది.

ఇద్దరూ బియ్యేవరకు కలిసి చదువుకున్నారు. రాధకు సురేషంటే అప్పట్లో పెద్ద క్రేజ్. సురేష్ స్పోర్ట్సమాన్ కావడంతో అతనంటే పడి చచ్చేది. సురేష్ కూడా రాధంటే అభిమానించేవాడు.

యిద్దరూ మంచి స్నేహితుల్లా గడిపి విడి పోయారు.

కబుర్లు చెప్పుకుంటూ చాలా దూరం వచ్చేసారు. మిత్రుడు కలిసిన ఆనందం ఆమె ముఖంలో తాండవిస్తోంది.

''ఇంక వెళతాను రాధా యిప్పుడెళితేనేగాని బస్సుదొరకదు''అన్నాడు సురేష్.

“బలేవాడివే. చాలా సంవత్సరాల తర్వాత కన్పించి వెళతావంటే వూరుకుంటావేమిటి. పద మా యింటికి పోదాం. రేపెళ్ళుదువుగానిలే'' అంటూ ఆపింది.



## తమిళనాడులో స్తంభన

భారతదేశంలో అత్యధిక చిత్రాలను నిర్మించే రాష్ట్రాల్లో ఒకటైన తమిళనాడులో గత మూడు నెలలుగా ఒక్క కొత్త చిత్రం కూడా ప్రారంభం కాలేదు. మరో మూడు నెలల వరకు ఇదే పరిస్థితి నెలకొని ఉంటుందని అంటున్నారు. దీనికి కారణమేమంటే డిస్ట్రిబ్యూటర్స్, బయ్యర్స్‌కు నటీనటులకు మధ్య ఏర్పడిన వివాదం. పారితోషికాలు తగ్గించుకోమని కోరితే అందుకు ఆర్టిస్టులు నిరాకరించారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో లాగా అక్కడా నిర్మాణ వ్యయం పెరిగి చిత్ర పరిశ్రమ అతాలా కుతలం అవుతోంది. దీంతో ఆరు నెలల పాటు ఏ చిత్రాన్ని ప్రారంభించకూడదని నిర్ణయించారు. కాని తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ నటించే ఒకే ఒక్క చిత్రం మాత్రం ఎలాంటి ఆటంకాలు లేకుండా షూటింగ్ జరుపుకుంటుంది.

నారాయణరాజు.

---

ఆమె కళ్ళలోని ఆహ్వానం వల్లనో లేక అత నామె సమక్షాన్ని కోరుకుంటున్నాడో తెలియదు గాని 'సరేపద' అన్నాడు.

వాళ్ళిద్దరూ మెయిన్ రోడ్ నుంచి పక్క స్ట్రీట్ లోకి తిరిగారు. అక్కడున్న రెస్టారెంటులోకెళ్ళి ఫేమిలీ రూములో కూర్చుని కాఫీ తాగుతూ కాలేజీలో సరదాగా గడిపిన రోజుల్ని తలుచుకున్నారు. అందులో నుంచి బయటకొచ్చారు. రాధ తనకి కావలసిన కాస్మొటిక్స్ కొనుక్కుంది.

అప్పటికి దాదాపు తొమ్మిది గంటలు కావస్తోంది.

"ఇంక యింటికి వెళదాం సురేష" అని చెప్పి రిక్షాని పిలిచింది. ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు. ఒకరి శరీరం మరొకరికి తగులుతుంటే యిద్దరికీ ఏదోలా వుంది.

రిక్షా నెమ్మదిగా పోతోంది. తలంటుకున్న రాధ జుట్టులో నుంచి షాంపూ పరిమళాలు సురేష్‌ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

కొంచెం దూరం పోయేసరికి ఓ కార్నర్‌లో గోలగోలగా వుంది. రిక్షాను ప్రక్కగా ఆపుచేశాడు. స్ట్రీట్ లైటు వెలుగులో అక్కడ జరుగుతున్న గొడవను చూసారిద్దరూ.

పోలీసులు కొంతమంది ఆడాళ్ళని, మగాళ్ళని రోడ్డు ప్రక్కనున్న యిళ్ళలో నుంచి బయటకు లాక్కొస్తున్నారు. ఆడవాళ్ళు అస్థిపంజరాల్లా వున్నారు. తమని వదిలిపెట్టమని పోలీసులను బతిమాలుకుంటున్నారు. పోలీసులు వాళ్ళని వదిలిపెట్టడం లేదు. స్టేషన్‌కి పదమంటున్నారు.

మగవాళ్ళు మాత్రం పోలీసుల చేతుల్లో తలో కాస్త పెట్టి నెమ్మదిగా అక్కడ నుంచి జారుకున్నారు. ఆడవాళ్ళను మాత్రం అక్కడినుంచి నడిపించుకుంటూ స్టేషన్‌కి తీసుకెళ్ళారు.

"ఏమయ్యింది" అనడిగింది రాధ.

"రైడింగయ్యిందమ్మా. పోలీసోల్లకి డబ్బుల్లేనప్పుడు, కేసుల్లేనప్పుడు అలా రైడింగులు చేసి పట్టుకుపోతుంటారు" అన్నాడు రిక్షావాడు.

"అయినా ఆ ఆడాళ్ళకి సిగ్గులేక పోతే సరి ఒళ్ళు కొవ్వెక్కి కాకపోతే ఆవేషాలేమిటి. హాయిగా మొగుళ్ళతో కాపురం చేసుకుంటూ ఏ పని చేసుకున్నో బ్రతకొచ్చు కదా" అంటూ వాళ్ళని యీసడించుకుంది.

"ఆ మగాళ్ళకు మాత్రం బుద్ధుందంటావా. చూస్తే అంతా వయసు మళ్ళిన వాళ్ళు, పెళ్ళయిన వాళ్ళలాగే వున్నారు. యింట్లో పెళ్ళాలను పెట్టుకుని వెధవపనులూ వాళ్ళూను" అంటూ మగాళ్ళ మీద మండి పడ్డాడు సురేష్.

రిక్షా అక్కడ నుంచి కదిలి పది నిముషాల్లో రాధ యింటికి చేరుకుంది. యిద్దరూ లోపలికి నడిచారు. యిల్లు చాలా అందంగా అలంకరించబడి వుంది.

వాళ్ళు వెళ్ళేసరికి వంట మనిషి ఎదురు చూస్తోంది.

"రంగమ్మా అన్నీ డైనింగ్ టేబులు మీద సర్దేసి నువ్వెళ్ళిపో" అని చెప్పింది రాధ.

"అలాగేనమ్మా" అంటూ రంగమ్మ లోపలికెళ్ళి పది నిముషాల్లో అన్నీ సర్దేసి వెళ్ళిపోయింది. సురేష్ సోఫాలో కూర్చుని టీపాయి మీదున్న పత్రికల్ని తిరగేస్తున్నాడు.

"పద సురేష్ భోజనం చేద్దాం" అంటూ లోపలి నుంచి వచ్చింది.

యిద్దరూ భోజనానికి కూర్చున్నారు. "మీ వారు రారా" తింటూ అడిగాడు సురేష్.

"ఆయనెప్పుడొస్తారో ఆయనకే తెలియదు. వస్తే ఆయనే తింటారు. ఆయనకోసం ఎదురు చూస్తే నాపని పస్తులే" అంటూ నవ్వింది.

భోజనం చేసిన తర్వాత యిద్దరూ మేడపైకి వెళ్ళారు. అక్కడ సెపరేట్‌గా ఓ బెడ్ రూముంది. దానికి ఎటాచ్‌డ్ వున్నాయి.

"ఈ రాత్రికి యిందులో పడుకో సురేష్. పోయి స్నానం చెయ్యి. యివిగో మా వారి నైట్ డ్రస్. నేనూ స్నానం చేసొస్తాను. కాస్సేపు కబుర్లు చెప్పుకోవచ్చు" అంటూ క్రిందికెళ్ళిపోయింది.

స్నానం చేసి డ్రస్ మార్చేసరికి ఎంతో హాయిగా అన్పించింది సురేష్‌కి. మంచం మీద పడుకుని రాధ గురించే ఆలోచిస్తున్నాడు.

రాధ, తను మంచి స్నేహితులే తప్ప అంతకు మించి యిద్దరి మధ్య ఏమీ లేదు. ఎందుకో యిప్పుడు రాధతో తియ్యని అనుబంధం పెట్టుకోవాలనిపిస్తోంది. రాధ ఒప్పుకుంటుందా? రాధ మనస్సులో ఎటువంటి ఆలోచన లేకపోతే తననెందుకు యింటికి పిలుస్తుంది. కాలేజీలో చదువుకునే రోజుల్నుంచీ రాధ మీద తనకి కోరిక వుంది. అడిగితే ఏమనుకుంటుందోనని అప్పుడు నోరు విప్పలేదు. యిప్పుడు ధైర్యం చెయ్యాలి.

◆◆◆◆◆

**ఇద్దరూ మంచి స్నేహితుల్లా గడిపి విడిపోయారు**

◆◆◆◆◆

◆◆◆◆◆

## "ఇంట్లో పెళ్ళాలను పెట్టుకొని వెధవ పనులూ వాళ్ళూనూ..."

◆◆◆◆◆

"ఏం వేస్తున్నావ్ బోరుకొడుతోందా" అంటూ వచ్చింది రాధ.

ఆమెను చూసి రెప్ప లార్పడం మరిచిపోయాడు సురేష్.

దేవతావస్త్రం కట్టుకున్న దేవతలా తెల్లని, పల్చని నైటీలో వుంది. ఆమె శరీరం వింతగా మెరుస్తోంది. ఆ నైటీలో నుంచి ఆమె వేసుకున్న అండర్ వేర్, బ్రాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

కళ్ళ దగ్గర నుంచి పాదాల వరకు వున్న అవయవాలు వుండవలసిన సైజులో కన్నా పెద్దవిగా వున్నాయి.

ఆమెనలా చూస్తుంటే అతను తట్టుకోలేకపోతున్నాడు

"ఏమిటలా చూస్తున్నావు క్రొత్తగా". తెల్లని పలువరుస కన్పించేలా నవ్వింది. 'అబ్బే ఏం లేదు' అంటూ తడబడ్డాడు సురేష్.

ఇప్పుడు అధైర్యపడితే లాభం లేదనుకుని మంచం మీద నుంచి లేచి ఆమె ఎదురుగా నిలబడ్డాడు.

ఆమె కళ్ళు కొంటెగా నవ్వుతున్నాయి. పెదాలు మెరుస్తూ కవ్విస్తున్నాయి. ఆమె ఏమనుకున్నా సరే అనుకుని ఆమె నడుం చుట్టూ చేయివేసి దగ్గరగా లాక్కుని ఆమె పెదాలను గట్టిగా ముద్దాడాడు.

"హమ్మయ్య! యిన్ని సంవత్సరాలకు ధైర్యం వచ్చిందన్నమాట. కాలేజీ రోజుల నుంచి చూస్తున్నాను. నువ్వు ధైర్యంచేస్తే నీ కౌగిలిలో కరిగిపోవాలని. కాని వట్టి ముద్దపప్పులా వుండిపోయావు. యిప్పటికైనా నా కోరిక నెరవేరింది" అంటూ అతన్ని గట్టిగా హత్తుకుపోయింది.

సురేష్ ఆమెను మంచం మీదకు చేర్చాడు.

"మీ ఆయనొస్తే" అడిగాడు సురేష్.

"ష్! యిప్పుడు ఆయన గొడవెందుకు. పూర్తిగా తాగొస్తారు. పైకొచ్చే వోపిక వుండదు. అంతకీ నా అవసరమొచ్చి వచ్చినా మనల్ని డిస్టర్బ్ చెయ్యడమెందుకుని క్రిందికి పోతారు" అంటూ నవ్వి అతని గుండెల్లో ముఖం దాచుకుంది.

యిద్దరూ ఈ లోకంలో లేనట్లు ఒకరిలో ఒకరు ఐక్యమై పోయారు.

—అయితే యిందాకటి ఆడవాళ్ళు ఒళ్ళు కొవ్వెక్కి ఆ పని వేయడం లేదని కడుపుమంట చల్లార్చుకోవడానికి వేస్తున్నారని, అసలు ఒళ్ళు కొవ్వెక్కి వేస్తున్నది తనే అని రాధ అనుకోలేదు.

ఆ మగవాళ్ళు తనలా భార్య వుండి కాదని, భార్యల్లేకే ఆ పని వేస్తున్నారని సురేషూ అనుకోలేదు.

గురువిందలు తన నలుపును గుర్తించవు కదా.

వాళ్ళ ప్రపంచంలో వాళ్ళున్నారు. ■

●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●●

## పుస్తక సమీక్ష

ఐ.ఎ.యస్. అధికారి శ్రీ విద్యాసాగర్ రచించిన "భద్రాచలం మన్నెం కతలు" తెలుగు సాహిత్యానికి సరికొత్త వొరవడిని సృష్టించాయని నిర్ద్వంధంగా చెప్పవచ్చు. అసలు వీటిని కతలు అనేకంటే జీవితాలు అంటే ఖచ్చితంగా అతికినట్లు వుంటుంది.



మనం ఆ గిరిజనుల మధ్య ఆ గిరిజన ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు, వారితో మాట్లాడుతున్నట్లు, వారి కష్టాల్లో, సుఖాల్లో పాలువంచుకున్నట్లు పాఠకుడు అనుభూతికి లోనయ్యే స్వచ్ఛతను సృష్టించడంలో రచయిత కృతకృత్యులయ్యారు. హేమండార్ఫ్‌సార్‌లాగా మనమూ ఆ ప్రాంతాలన్నీ చుట్టేసి వస్తేనో, పేరంటపల్లి స్వామిజీలాగా ఓ చిన్నపాటి ఆశ్రమం నిర్మించుకొని ఆ గిరిజనుల మధ్య స్వచ్ఛమైన ఆ ప్రకృతి ఒడిలో

## భద్రాచలం మన్నెం కతలు

పరవశించి పోతేనో అన్న, అనుభూతి, రసాన్ని పాఠకుడిలో సృష్టించగలిగిన రచయిత అటవి ప్రాంతపు దృశ్యాలను కలంతో చిత్రీకరించడంలో విజయం సాధించారు.

ఈ కథల్లో ఊహను మిళితం చేసి వుంటే తథ్యంగా ఇంత గొప్పగా మాత్రం వుండేవి కావు. ఈ విధమైన పరిశీలనాత్మక, పరిశోధనాత్మక, రసాత్మక కథలు ఎన్ని వస్తే తెలుగు సాహిత్యం అంత పరిపుష్టి పూరితమౌతుంది.

కథల్లో, పాత్రల్లో, పరిసరాల్లో స్వచ్ఛత, నిష్కాపట్యత కొట్టొచ్చినట్లుగా కనబడుతుంది. కథలకు కొసమెరుపులు, ఉత్కంఠతలు, ఎత్తుగడలు, తప్పనిసరిగా వుండాల్సిన అవసరం ఏమీలేదని ఈ కథలు నిరూపించాయి.

గిరిజనాభివృద్ధికి కంకణం కట్టుకున్న అధికారులకు, గిరిజనుల గురించి పరిశోధించే రీసెర్చి స్కాలర్లకు, ప్రభుత్వ ప్రణాళిక సంఘాలకు సైతం ఈ పుస్తకం ఘనంగా ఉపకరిస్తుంది. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే ఏం చేయాలో ఈ కతల్లోని పాత్రలు తెలియజేస్తాయి.

ఈ కతల సంపుటిలో సందర్భానుసారంగా ప్రచురించిన కలర్ ఫోటోలు, బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు సంపుటికి నిండుతనం చేకూర్చాయి.

నూట ఎనభై పేజీలు వున్న ఈ గ్రంథం ఆఫ్‌సెట్ కవర్ పేజీతో అందంగా ముద్రించారు.

వెల రూ. 35/-

ప్రాప్తిస్థానం:

గౌతమీ పబ్లికేషన్,

యస్.బి. 92

సైఫాబాద్, హైద్రాబాదు.

- యం.డి. చైతన్య.